విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

టీడీపీ నాయకురాలు వెంకటరత్నమ్మ మృతి

విశాలాంధ్ర-హనుమంతుని పాడు : మండల పరిధిలోని సీతారాంపురం గ్రామపార్టీ అధ్యక్షులు మరియు విద్యా కమిటీ చైర్మన్ సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి తల్లి వెంకట రత్నమ్మ సోమవారం అర్ధరాత్రి అనారోగ్యంతోమృతి చెందారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సాని కొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని వెంకట రత్నమ్మ భౌతిక దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, గాయం రామిరెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, కోటపాటి శేషయ్య, మరియు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

20 మందికి క్యాన్సర్ వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలం లోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం హెచ్‌సిజి ఎంఎన్ ఆర్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నారు రమణారెడ్డి మాట్లాడుతూ తరచుగా రక్తంతో కల్లె పడటం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, తరచుగా శ్వాసకోశ ఇబ్బందులు రావడం వంటివి ఉన్నట్లయితే ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ శిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 20 మందికి క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించి ఒంగోలుకు రిఫర్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోపన బోయిన శ్రీనివాసరావు, సూపర్వైజర్ నాగేశ్వరరావు, వేమా శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీకి గాయాలు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం తాటిచెర్ల ఎంపీటీసీ కామూరి శ్రీనివాసరెడ్డికి రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారు జామున గుంటూరు నుంచి కొమరోలుకు కారులో శ్రీనివాసరెడ్డి వస్తున్న సమయం లో కారు కొమరోలు మండలం ఎడమ కల్లు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే అదుపుతప్పి ఓ చెట్టును ఢీ కొట్టింది. ఈ సంఘట నలో ఎంపీటీసీ కామూరి శ్రీనివాసరెడ్డికి తీవ్ర గాయాల య్యాయి. తీవ్రంగా గాయపడ్డ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డికి కొమరోలులో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పొద్దుటూరుకు తరలిస్తున్నారు.

పేదలకు అన్నదానం కార్యక్రమం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మండలం యేరువారిపల్లి గ్రామస్తుడు బల్లి చిన్నబాబు ఇటీవల రోడ్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకు న్నారు. మంగళవారం స్థానిక శివాలయంలో కుటుంబ సమేతంగా సర్పంచ్ వెంకటయ్యతో కలిసి పూజలు నిర్వహించారు. కనిగిరి స్నేహస్తం సేవా సంస్థ డైరెక్టర్ సుధీర్ బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్య క్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని 150 మంది రోగులకు భోజనం పెట్టించారు. కార్యక్రమంలో యేరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ గఫూర్, యేరువారిపల్లి మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మాజీ అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ లతీఫ్, ఏరియా ఆసుపత్రి సూపరెంట్, పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండల జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు ఆధ్వర్యంలో గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొమరోలులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైసీపీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, పలువురు నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం కొమరోలు సమీపంలో డ్రీమ్ రెస్టారెంట్ వద్ద జెడ్పీటీసీ వెంకట నాయుడు భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు.

పసి బిడ్డకు ముర్రుపాలే బలం

విశాలాంధ్ర-ముండ్లమూరు : అప్పుడే పుట్టిన బిడ్డకు అరగంట లోపే తల్లి ముర్రుపాలు తాగించినట్లయితే ఆరోగ్యంగా బలంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వి కమల కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డలకు తల్లిపాలు చాలా ప్రాముఖ్యమైనవి, తల్లిపాలు ఆరోగ్యానికి శ్రేష్టమైనవని అన్నారు. బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చేంతవరకు తల్లిపాలు తాగించాలన్నారు. గ్రామాల్లోని అంగన్వాడి సెంటర్ల వద్ద తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా తల్లిపాలే ముద్దు డబ్బా పాలు వద్దు అంటూ నినాదాలతో గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఆర్ అజిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

కండ్ల కలకకు హోమియో మందు పంపిణీ

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని జంగంగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం కండ్ల కలక నివారణకు హోమియో మందులను పంపిణీ చేశారు. మోక్ష గుండం హోమియో వైద్యశాల డాక్టర్ పి.గిరిధర్ పాఠశాలను సందర్శించి కండ్ల కలకలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. డాక్టర్ పి. గిరిధర్ మాట్లాడుతూ వ్యాధి కారక సూక్ష్మజీవులు చేతి ద్వారా, లేదా ఏదైనా ఇతర వసువుల ద్వారా మాత్రమే వ్యాపిస్తుంటాయన్నారు. వర్షాలు అధికంగా పడే సమయంలో కంటికి సంభందించిన ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయనీ, తగు జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గని. వెంకటేశ్వర్లు, సైన్స్ ఉపాధ్యాయుడు బి.పిచ్చిరెడ్డి, హోమియో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం



విశాలాంధ్ర-కనిగిరి : జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఈనెల 23న మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం జరుగగా 2వ విడతగా కంటి ఆపరేషన్ల కోసం 3 ప్రత్యేక వాహనాల్లో మంగళవారం తరలివెళ్లారు. 158 మంది కంటి ఆపరేషన్ కోసం వృద్ధులు వెళ్లారు. కంటి ఆపరేషన్ అనంతరం వీరందరూ 3వ తేదీ తిరిగి కనిగిరి రానున్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

తల్లిపాలే బిడ్డకు బలమైన ఆహారం
ముర్రుపాలలో రోగనిరోధక శక్తి
తల్లిబిడ్డల మధ్య అనుబంధానికి మూలం
బిడ్డకు ముర్రుపాలు... తల్లికి మురిపాలు
ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-పీసీపల్లి : అమ్మ అనే పదంలో ఆప్యాయత అనురాగం మురిపం అనే సుగుణాలు మలినమై ఉన్నాయి. అలాంటి అమ్మ పాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తున్నాయి కడుపులో ఉన్న తొమ్మిది నెలలు బిడ్డకు కావాల్సిన ఆహారాన్ని తల్లి సమకూరుస్తుంది బిడ్డ పుట్టిన క్షణం నుంచి తల్లి తన ముర్రుపాలతో బిడ్డకు ఆహారాన్ని అందిస్తోంది తల్లిపాలతో బిడ్డకు ఆకలి తీర్చడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి పెంచుతుంది అమ్మ పాల గురించి ప్రతి గర్భిణీకి బాలింతలకు అవగాహన కల్పించడం కోసం నేటి నుండి వారం రోజులపాటు స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రేగు తెంచుకొని పుట్టిన బిడ్డకు పాలు ఇవ్వడం మాతృత్వపు బాధ్యత తల్లిపాలు త్రాగడం పుట్టిన బిడ్డ హక్కు అమ్మపాలతో ఆకలి తీర్చుకుంటేనే ఆ బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసవించిన గంట తరువాత తల్లి ఇచ్చే ముర్రు పాలలో ఎన్నో విటమిన్లు ఉంటాయి. అనారోగ్య సమస్యలు దరిచేరవు తల్లిపాలలో ఎన్నో రకాల పోషకాలు బిడ్డ ఎదుగుదలకు దోహదపడే అనేక రకమైన కారకాలు ఉంటాయి. బిడ్డ శారీరకంగా ఎదుగుదలకు మానసిక వికాసానికి ఉపయోగపడతాయి. ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో తల్లిపాల వారోత్సవాలు మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నారు తల్లిపాలు బిడ్డకు ఇవ్వటం వలన రొమ్ముల్లో పాలు గడ్డ కట్టకుండా ఉంటాయి. ముఖ్యంగా క్యాన్సర్ బారిన పడే ప్రమాదం నుండి తప్పించుకుంటారు పాలు ఇవ్వకపోవడంతో తల్లికి జ్వరంతో పాటు వివిధ ఇబ్బందులు ఎదురవుతాయి.

ముర్రు పాలలో పోషకాలు :- ముర్రుపాలలో రోగనిరోధక శక్తి పెంచి బిడ్డ ఎదుగుదలకు దోహదం చేసే పోషకాలు ఉన్నాయి. బిడ్డ మెదడు అభివృద్ధికి తోడ్పడి ప్రతిభను పెంచేదిగా ముర్రుపాలు సహకరిస్తాయి బరువు పెరగడంతో పాటు వ్యాధులనుండి బిడ్డను సంరక్షించు కోవచ్చు ముర్రుపాలు చిక్కగా ఉండడంతో పాటు ప్రోటీన్లు పుష్కలంగా లభ్యమవుతాయి అలాంటి పాలని సేవించటం వలన బిడ్డ పెరుగుదల ఆరోగ్య కరంగా ఉంటుంది రోగనిరోధక శక్తి పెరిగే అవకాశం ఎక్కువగా ఉంది గర్భంలో ఉన్నప్పుడు బిడ్డ తల్లి నుంచి జటవాయువు ద్వారా ఆహారాన్ని తీసుకుంటుంది కానీ తల్లి గర్భం నుంచి వచ్చిన బిడ్డ తప్పకుండా తల్లిపాలని సేవించాల్సి ఉంటుంది బయటకు వచ్చిన శిశువు ఆకలితో ఉంటాడు గంటలోపు ముర్రి పాలు ఇచ్చినట్లయితే సేద తీరుతాడు సుమారు రెండు గంటలకు ఓసారి బిడ్డకు పాలు పట్టించాలి అలాగే ఏడ్చిన ప్రతిసారి శిశువుకు పాలు ఇవ్వటం మంచిది.

మహిళల రక్తహీనత :- గ్రామీణ ప్రాంత మహిళలు పిల్లల విషయంలో రక్తహీనత ఎక్కువగా ఉంటుంది ఈ లోపం గర్భిణీలు చిన్నపిల్లల్లో యవ్వన దశలోనే మరీ ముఖ్యంగా బాలికల్లో ఎక్కువగా ఉంటుంది దీనిని అరికట్టాలంటే గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా అవగాహన కార్యక్ర మాలను ప్రభుత్వాలు నిర్వహించాలి లేదా అంగన్వాడీ సెంటర్ల ద్వారా పోషకాహారం తీసుకోవడంతో లాభాలను వారికి వివరించే విధంగా చర్యలు చేపట్టాలి

తల్లిపాలలో ఉండే పోషకాలు :- బిడ్డ పుట్టగానే తల్లి నుంచి ముర్రుపాలు వస్తాయి వీటిని కచ్చితంగా పుట్టిన బిడ్డకు తాగించాలి తల్లిపాలలో కొవ్వు 6 శాతం ప్రోటీన్స్ 2 శాతం పిండి పదార్థాలు 2 శాతం చక్కెర 2 శాతం పొటాషియం 1 శాతం క్యాల్షియం 3 శాతం విటమిన్ ఏ 4 శాతం విటమిన్ బి 12.1 శాతం తల్లిపాలలో ఈ విధమైన పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి.

వ్యాధులకు దూరం :- తల్లిపాలు అందని పిల్లల్లో ఉబ్బస వ్యాధి లక్షణాలు ఎక్కువగా ఉంటాయి పిల్లల వైద్య బృందం తమ అధ్యయనంలో తేల్చింది కనీసం ఆరు నెలలైనా ముర్రుపాలు తాగిన పిల్లల్లో జలుబు దగ్గు శ్వాస సంబంధిత ఇబ్బందులు కనిపించవు ఈకోలి సూక్ష్మక్రములు ఇతర రోగకారిక వైరస్‌లను ఎదుర్కొనే యాంటీ బయోటిక్లు తల్లిపాలలో ఎక్కువగా ఉంటాయి వీటిలో ఉండే ఇమ్యునో గ్లోబల్, లాక్టోపె రాక్సీడ్స్ శిశువుకు కాపాడుతాయి. డయేరియా చర్మంపై దద్దుర్లు వంటివి కూడా పిల్లలకు దరిచేరకుండా శక్తినిస్తాయి. నిద్రలో శిశువుల్లో సంబంధించి ఆకస్మిక మరణాలను అమ్మ పాలు అడ్డుకుంటాయి.

సరోజిని సీడీపీఓ

అవగాహన కల్పిస్తాం :- తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నేటి నుండి ఏడు రోజులు పాటు తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణీలు బాలింతలకు అవగాహన కల్పిస్తాం తల్లిపాల సంస్కృతిని మా శాఖ తల్లులకు తెలియజేస్తాం బిడ్డకు ముఖ్యంగా తల్లిపాలే పౌష్టికా హారమని అంగన్వాడీ కేంద్రాలలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాలలో ర్యాలీలు ద్వారా వివరిస్తాం.

జరీనా అంగన్వాడీ సూపర్వైజర్,

ఈనెల7 నజరుగు మహా ధర్నా జయప్రదం చేద్దాం

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఆగస్టు ఏడో తేదీన జరుగు మహాధర్నా జయప్రదం చేయాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ సీపీఐ పార్టీ ఇన్‌ఛార్జ్ డీ.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధి విధానాల వల్ల మన రాష్ట్రం రైతు ఆత్మహత్యలులో దేశంలో మూడో స్థానంలో ఉందని, ప్రతి రైతు 2,45,000 ఆర్థిక రుణభారంతో ఉన్నారని, ఒకపక్క ఎరువులు విత్తనాలు పురుగుమందులు ధరలు అమంతం పెరిగిపోవడం ప్రకృతి విపత్తుల వల్ల రైతులు సాగు చేస్తున్న పంటలు ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడం వల్ల రైతుల అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి రైతుకు ఎకరాకు సాగు సాయం కింద పదివేల రూపాయలు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలని రెండు ఎకరాల లోపు రైతులకు 20 వేల రూపాయలు సాగుకు సాయం ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలని, అదేవిధంగా ఎటువంటి షరతులు లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సూక్ష్మ నీటి సేద్యపు పరికరాలను లింకు పైపులను ప్రభుత్వ సబ్సిడీ పైన ఇవ్వాలని, 50 సంవత్సరాల పైబడిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పెన్షన్ ప్రభుత్వం ఇవ్వాలని, ఆర్బీకే కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు ఎరువులు పురుగుమందులు సబ్సిడీపై రైతులకు అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తలపెట్టిన మహా ధర్నాను రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని రైతులకు పిలుపునివ్వడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కేవి కృష్ణగౌడ్ నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి బాణాలరామయ్య, సీపీఐ పార్టీ మండల నాయకుడు ఆచారి, పూర్వకట్టి తిరుమలయ్య రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు నగరంలో ఉన్న స్మశానాలు అన్ని అభివృద్ధి చేయాలి - మారెళ్ళ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : నగరంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల స్మశానంలోని గ్యాస్ క్రిమ టోరియంను వెంటనే ప్రారంభించాలని, అలాగే అక్కడ అధిక ధరలను నిరోధించేందుకు సేవల ధరల బోర్డు ఏర్పాటు చేయాలని, దీంతో పాటు నగరంలోని అన్ని స్మశానాలను అభివృద్ధి చేసి నగర ప్రజలకు అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ బృంధం నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ యం. వెంకటేశ్వరరావుకి మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. మారెళ్ళ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ధర్నా కూడా నిర్వహించామని తెలిపారు. బస్టాండ్ వద్ద గల స్మశానంలో 2 కోట్ల రూపాయలతో గ్యాస్ క్రిమ టోరియంను నిర్మించి అధికారికంగా జూన్ 9వ తేదీ ప్రారంభించారని, కానీ ఆ మిషన్‌ను వినియోగంలోకి రాకపో వడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శన మని విమర్శించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సంఘం సభ్యులు జి. రమేష్, బత్తుల మునలా రెడ్డి, అబ్బూరి లక్ష్మీనారాయణ తదితరు లున్నారు.

ఈ నెల 6 న చుండూరు నరమేధ స్మారక సభలు జరపాలి

దళిత బహుజనుల కు దళిత నేత నీలం విజ్ఞప్తి

విశాలాంధ్ర-ఒంగోలు : ఈ నెల 6వ తేదీన చుండూరు నరమేధ స్మారక సభలు నిర్వహించాలని, దళిత చైతన్యం దాటాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక సమితి కార్యాలయంలో నీలం నాగేంద్ర మాట్లాడుతూ 1991 ఆగష్టు 6న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వుంది చుండూరు మాల పల్లె పై ఆటవీక రెడ్ల ముఠా దాడి చేసి నర మీదం సృష్టించిందన్నారు. పోలీస్ బలగాలను పల్లె చుట్టూ మొకరించి ఇళ్లల్లో చాకులు, కత్తిపీటలు కూడా లేకుండా పోలీస్‌లు తీసుకెళ్లారన్నారు. నిరాయుదులు ఐనా మాలలపై కత్తులు గొడ్డళ్ళు బడిసలతో చుండూరు చుట్టూ పక్కల గ్రామాల రెడ్ల ముఠా మారణకాండ సృష్టించి పది మందిని పొట్టన పెట్టుకున్నరన్నారు. మాలల శవాలను తుంగభద్ర నదిలో వేసి రక్తపు తెరులు పారించారన్నారు. చుండూరులో మాలల నీరహర దీక్ష శిబిరం పై పోలీస్‌లచే దాడి చేయించి అనిల్ కుమార్ అనే దళిత యువకుడిని కాల్చి చంపరన్నారు. రాష్ట్రంలో చుండూరు మారణకాండ పై దళితుల నిరసన పై ముఖ్యమంత్రి జనార్ధన్ రెడ్డి ఉక్కు పాదం మొపాడు కారంచేడు మారణకాండలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్ టీ ఆర్ డిఫెన్సెలో పడి కారం చేడు ఉద్యమం పట్ల ఉదారంగా వ్యవహారించారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఓట్ బ్యాంక్ ఐనా మాలలను నరహంతక రెడ్లు ఉచకొత కోసి కూడా రాష్టంలో రెడ్లు పోలీస్‌లు చుండూరు దళిత ఉద్య మాలపై నిర్బంద దమనకాండ అమలు చేశారు. రాష్టంలోని కాంగ్రెస్ నిరం కుశ ఫాసిస్ట్ విధానం వలన న్యాయం జరగదని చుండూరు దళితులు దేశ రాజధాని ఢిల్లీలో చుండూరు దళిత ఆత్మ గౌరవం ప్రతిఘటన పోరు చేశారు. చుండూరు దళిత మృతు వీరుల రక్త దారలే నేడు భారత దేశ దళితులు అనుభవిస్తున్న దళితుల వజ్ర యుధమైన ఎస్సీ ఎస్టీ యాక్ట్ కావున దళిత బహుజన సంఘాలు ఈ నీల 6 వ తారీకు న చుండూరు మృతు వీరుల స్మారక సభలో పల్లె పల్లెల్లో నిర్వహిం చాలని దళిత నేత నీలం నాగేంద్ర విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేలూరి శ్రీనివాస్‌రావు, తానికొండ ఆనంద్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో జరిగే అల్లర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలి

-పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పద్మ

విశాలాంధ్ర-ఒంగోలు : మణిపూర్ రాష్ట్రంలో నాగా, కుకి ఆదివాసీలపై జరుగుతున్న మారణ హోమాన్ని ఆపాలని, ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పద్మ డిమాండ్ చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరి కట్టాలని, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 2002లో గుజరాత్ మారణకాండను సృష్టించిన మోదీ అమిత్ షాలే నేడు మణిపూర్ రాష్ట్రానికి చిచ్చు పెట్టారని అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న మైతిలకు ఎస్‌టి హోదాను కల్పించడాన్ని నాగా, కుకి ఆదివాసి తెగలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని, తమకు ఉన్న అవకాశాలను కోల్పోతామని భావిస్తున్నారని అన్నారు. మైతిలు రాజకీయంగా కూడా పట్టు కలిగిన వారని తెలిపారు. మైతిలకు, కుకి నాగా ఆదివాసీ తెగలకు మధ్య అగ్గి రాజేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పబ్బం గడుపుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. అందులోని ఒక మహిళకు చెందిన తండ్రిని, తమ్ముడిని కిరాతకంగా హత్య చేశారన్నారు. పోలీసుల సమక్షంలోనే ఈ సంఘటనలు జరగడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలోపి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి వి మంజుల మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రం తగల బడుతుంటే గిరిజన మహిళ ముర్ము రాష్ట్రపతిగా ఉండి ఏమి చేస్తుందని ప్రశ్నించారు. ఈ సంఘటనకు భాద్యత వహిస్తూ ప్రధాని మోదీ, హోమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, మణి పూర్ సీఎం బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని భర్త్ రఫ్ చేయాలని చేయాలని, మహిళలపై జరుగుతున్న, అత్యాచారాలను, హత్యలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలోప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పద్మ, సహాయ కార్యదర్శి పి సుశీల, సీతారావమ్మ, నాయకులు వేణి రవీంద్ర, అమ్మాజీ, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు

హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వైస్ చైర్ పర్సన్ గా దగ్గుమాటి అనూష

విశాలాంధ్ర -ఒంగోలు: ఒంగోలుకు చెందిన దగ్గుమాటి అనూష హ్యూమన్ రైట్స్ మహిళా విభాగం రాష్ట్ర వైస్ చైర్ పర్సన్గా నియమితులైయ్యారు. ఈ మేరకు నేషనల్ ఛైర్మన్ ప్రసన్న కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో ఈ పదవీకి ఇచ్చినందుకు, పదవీ రావడానికి సహకరించినందుకు ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా సమాజంలో మానవ హక్కులపై ప్రజలకు చైతన్యం కల్పించేందుకు తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. అదే విధంగా హ్యూమన్ రైట్స్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : మండలంలోని పూసల పాడు, చెట్టిచర్ల, బేస్తవారిపేట చింతలపాలెం గ్రామాలలోని నర్సరీలను ఉద్యానవన శాఖధికారి శ్వేత మంగళ వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షేడ్ నెట్ నర్సరీ నిర్వాహకులు రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, మొక్కలు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. రైతుల నుండి ఫిర్యాదులందినట్లయితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో వీఏఏ ప్రతాప్ రెడ్డి, సత్యనారాయణ, సుజాత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంటపై అవగాహన కార్యక్రమం



విశాలాంధ్ర-సీఎస్‌పురం : చంద్రశేఖరపురం మండలంలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు మరియు వీఆర్వోలకు ఖరీఫ్ 2023 ఈ పంట కార్యక్రమం మీద కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి రైతు సాగు చేయు పంటలను జియో కోఆర్డినేట్స్ ఆధారంగా పంటలను నమోదు చేయాలని సూచించారు. ఎప్పుడైనా పంట కాలంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నప్పుడు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, పంటల భీమ పొందవచ్చును. రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వారికి పంట సాగుకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. వ్యవసాయాధికారి జి. మధు మాట్లాడుతూ పియం కిసాన్ ఈకేవైసి చేయించుకొని రైతులు తొందరగా చేయించుకోవాలని తెలిపారు.

భూమాయగాళ్లు యదేచ్ఛగా భూములను ఆక్రమిస్తున్నారు

విశాలాంధ్ర-కనిగిరి : అధికారమే పెట్టుబడిగా కొందరు వైసీపీ నాయకులు చెలరేగి పోతున్నారు. ఖాళీగా కనిపించిన ప్రభుత్వ భూముల్లో బాగా వేస్తు న్నారు వందల ఎకరా లను మింగేస్తున్నారు. ఆ పార్టీలోని వ్యతిరేక వర్గం వారే ఈ విషయం ఫిర్యాదులు చేస్తు న్నప్పటికీ ఏ అధికారి కన్నీటి చూడటం లేదు. కనిగిరి, పీసీపల్లి, సీఎస్‌పురం, వెలిగండ్ల, పామూరు, కొనకలమెట్ల తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. జిల్లాలో విస్తారంగా ప్రభుత్వ భూములు ఉన్న ప్రాంతాల్లో కనిగిరి ఒకటి. వీటిపై వైకాపా నాయకులు కళ్ళు పడ్డాయి. అధికారులను మచ్చిక చేసుకుంటూ రికార్డులు తారుమారు చేస్తూ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో వందల ఎకరాలు అక్రమించుకున్నారు. కొందరైతే ఏకంగా పాస్ పుస్తకాలు కూడా చేయించుకొని బ్యాంకు ల్లో రుణం పొందుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కనిగిరి మండలం మాచవరం గ్రామంలోని సర్వే నెంబరు 634 ఏ, 634 అసైన్మెంట్ భూములను వైఎస్ఆర్సిపి నాయకులు ఆక్రమించుకొని ప్లాట్లుగా ఏర్పాటు చేసి విక్రయించారని, 667 సర్వేనెంబర్ భూమిలో దొంగ పట్టాలతో ప్లాట్లు వేసి రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ... ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామానికి ఒంటిపెంట రమేష్ ఆర్డీవో అజయ్ కుమార్ కు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం ఇచ్చి ఆర్డిఓ కార్యాలయం ముందు నిరసన చేపట్టాడు.

సీఎస్‌పురం మండలం రేకుల చేలకలో ఓ నాయకుడు 200 ఎకరాల ప్రభుత్వ అసైన్మెంట్ ,పశువుల భూములను ఆక్రమించి ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లతో ఆన్లైన్ చేయించు కున్నారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన పాలకుడు పదేపదే అధికారంలో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపడుతున్న చర్యలు నామమాత్రం.

వెలిగండ్ల మండల కేంద్రంలో సుమారు రెండు కోట్ల విలువైన చేసే ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయానికి సిద్ధంగా ఉండటంతో జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అధికారులకు ఫిర్యాదు చేశారు. పామూరు మండలం ఏమి కోట ప్రాంతంలో ఇద్దరు నాయకులు వాగు పోరంబోకు పశువుల వీడు భూమిని ఆక్రమించారు కొంత సాగు చేసుకుంటున్నగా మరికొంత విగ్రహానికి పెట్టారు స్వయాన అధికార పార్టీ నాయకులు ఆక్రమణల పరంపర కలెక్టర్ తాసిల్దార్ కు విన్నవించారు అయినా ఫలితం శూన్యం. కనిగిరి మండలం ఈదులవాగు సమీపంలో వైసీపీ నాయకుడు 10 ఎకరాల మీద అసైన్మెంట్ భూమిని ఆక్రమించుకొని ప్లాట్లుగా మార్చి విక్రయానికి సిద్ధంగా ఉంచాడు. కనిగిరి డివిజన్లోని వివిధ మండలాల్లో భూకబ్జాలు పెట్రేగిపోతున్నాయి. వైసీపీ నేతలు ఏదేచ్ఛగా ప్రభుత్వ భూములు వాగు పోరంబోకు భూములు ఆక్రమించుకుంటూ ప్లాట్లుగా మార్చి విక్రయానికి పెడుతున్నారు. అధికారులు వైసిపి నాయకులకు కొత్త సిబ్బంది వారిపై చర్యలు తీసుకోవడానికి సాహసించడం లేదు. ప్రభుత్వం అధికార పార్టీకి చెందిన నేతలు పోటపోటీగా ఆక్రమించుకుంటున్నారు. ఒక ఎకరా కూడా భూమి మిగలకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి భూఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

జోష్ పెంచిన యువగళం

-లోకేష్ యువగళానికి జిల్లా వ్యాపితంగా ఘననీరాజనం
-వైసీపీ నేతల టార్గెట్‌గా లోకేష్ మాటల తూటాలు
-ప్రతి నియోజకవర్గంలో మల్లగుల్లలైన వైసీపీ శ్రేణులు
-జిల్లా వ్యాపితంగా తెలుగు తమ్ముళ్లలో పెరిగిన గెలుపు విశ్వాసం
-'జయహో బిసి' తో బిసి వర్గాలలో మొదలైన ఆలోచన
-వైసీపీ శ్రేణుల ముప్పేట దాడి
-ఉమ్మడి ప్రకాశంలో ముగిసిన యువగళం పాదయాత్ర

అద్దంకిలో అశేష ప్రజానీకం నడుమ బహిరంగ సభ

విశాలాంధ్ర-ఒంగోలు : తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మంగళవారంతో ముగిసి ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండ నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 17 రోజుల పాటు సాగిన పాదయాత్రలో లోకేష్‌కు ప్రజలు అడుగడుగున నీరాజనాలు పలికారు. టిడిపి నాయకులు ఘనస్వాగతాలు పలికారు.లోకేష్ ప్రతి ఒక్కరినీ విసుగువిరామం లేకుండా పలకరిస్తూ,అభివాదం చేస్తూ, ప్రజల సమస్యలను శ్రద్ధగా వింటూ సమస్యల పరిష్కారానికి టిడిపి అధికారంలోకి వస్తే ఎలా చేస్తుందో వివరిస్తూ ముందుకు సాగారు.ప్రతి సామాజిక వర్గంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి మీటింగ్‌లోనూ తెలుగుతమ్ముళ్లల్లో జోష్ నింపటంతో పాటుగా స్థానంగా ఉన్న సమస్యలను, అక్కడ ప్రజాప్రతినిధులను టార్గెట్ చేస్తూ బుల్లెట్‌ల వంటి మాటల తూటాలను వదిలారు.దీంతో టీడీపీ వర్గాలలో నూతన ఉత్సాహం రాగా, వైసీపీ శ్రేణులు విలవిల్లాడాయి. లోకేష్ లేవనెత్తిన సమస్యలకు పరిష్కార మార్గాలు చెప్పటం మానివేసి నేరుగా లోకేష్‌ను టార్గెట్ చేస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగారు.దీనిని బట్టే వైసీపీ గుండెల్లో లోకేష్ ఎలా రైళ్లు పరిగెత్తించాడో అర్ధమవుతుంది. రాటుదేలిన ప్రసంగాలతో లోకేష్ ప్రసంగాలు పాదయాత్ర ప్రారంభదినాలకు, ప్రకాశం జిల్లాలో అడుగు పెట్టేనాటికి చాలా మార్పులు వచ్చాయి. ప్రతి చోటా ఆయన ప్రసంగం మాటల తూటాల మాదిగా ప్రజల గుండెల్లోకి దూసుకు పోయాయి. స్థానికంగా ఉన్న సమస్యలపై ఎక్కువగా మాట్లాడటంతో ప్రజల మరింత శ్రద్ధగా ఆయన ప్రసంగాలను విన్నారు. అంతేకాకండా లోకేష్ బేషిజాలకు పోకుండా ప్రతి ఒక్కరినీ పలకరించటంతో పాటుగాప్రతి ప్రాంతంలో సెల్ఫీలకు సమయం ఇచ్చారు.ప్రతి ముసలి అవ్వనుండి, చిన్నారుల వరకు తనతో కలసి నడిచేలా జాగ్రత్తలు తీసుకున్నారు. యువతను ప్రోత్స హించారు. దీంతో ప్రజలు లోకేష్‌కు మరింతగా చేరువ య్యారు. లోకేష్ పాదయాత్ర ప్రారంభదినాలలో ప్రసంగా లలో తెలుగులోని తప్పులను విమర్శించటం, ఆయన బాడీ షేపింగ్‌లను టార్గెట్ చేస్తూ విమర్శలు చేయటం వంటివి చేసిన వైసీపీ రానురాను లోకేష్ చేసే విమర్శలకు జవాబులు దొరక్క ఏమీ చేయాలో పాలుపోక చాలెంజ్‌లు చేయటం వంటివి చేస్తూ మమ అనిపించుకున్నారు. ప్రధానంగా ప్రకాశం జిల్లాలో యువగళం పాదయాత్ర తూర్పు ప్రకాశం వైపు షెడ్యూల్‌లో లేకుండా లోకేష్ పాదయాత్రకు ప్రజలలో వస్తున్న స్పందన చూసి తమ ప్రాంతాలలో కూడా పాదయాత్ర చేయాలని ఇన్‌చార్జ్‌లు పట్టుబట్టి మరీ పాదయాత్ర చేయిం చుకని సఫలీ కృతులయ్యారు. నాయకులు ఐక్యంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో యువగళం పాదయాత్ర విజయవంతానికి ప్రధానంగా టీడీపీ నాయకుల ఐక్య కృషి ఎంతో ఉంది. పాదయాత్రలో ఎటువంటి ఆటంకాలు చోటు చేసుకోకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు.

బీసీలను దగ్గర చేర్చేలా జయహో బీసీ :
ఒంగోలులో జయహో బిసి అంటూ బిసిలను పార్టీకి దగ్గర చేర్చేలా ఏర్పాటు చేసిన కార్యక్రమం బిసిలను పార్టీకి మరింత దగ్గర చేసింది. ఈ కార్యక్రమానికి బిసి యాంకర్ ఉదయ భాను ప్రత్యేక ఆకర్షణగా నిలవటమే కాకుండా ఆమె లోకేష్‌ను అడిగిన ప్రశ్నల ద్వారా బిసిలలో కొత్త అలోచనలకు శ్రీకారం చుట్టింది.ఈ ఒక్క జయహో బిసి కారణంగా వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి. వైసీపీ బిసిలకు ఏమీ చేసింది చెప్పలేని స్థితిలో గ్లామర్ యాంకర్‌ను తెచ్చి టిడిపి గ్లామర్ పార్టీగా మారిందంటూ విమర్శలు చేశారు.

ఘనంగా జిల్లా శివారులో పాదయాత్రకు వీడ్కోలు:

17 రోజుల పాటు జిల్లాలో విజయ వంతం గా సాగిన పాదయాత్ర దర్శి నియోజక వర్గం శివారు ప్రాంతం లో ఘనంగా వీడ్కోలు పలి కారు. జిల్లాలోని పార్టీ నేతలంతా ఐక్యం గా వచ్చి లోకేష్‌కు ఘన వీడ్కోలు పలికారు. 17 రోజుల పాటు తనకు ఆతిధ్యమిచ్చికురిపించిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి జిల్లాల వారీగా యువగళం పాదయాత్ర వివరాలు నారా లోకేష్ మంగళవారం నాటికి రాష్ట్రంలోని 62 అసెంబ్లీ నియోజక వర్గాలలో 2266 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 నియోజక వర్గాలలో 45 రోజుల పాటు 577 కిలో మీటర్లు పాదయాత్ర చేయగా, అనంతపురం జిల్లాలో 9 నియోజక వర్గాల పరిధిలో 23 రోజులపాటు 303 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు. కర్నూల్ జిల్లాలో 14 నియోజక వర్గాలలో 40 రోజుల పాటు 707 కిలో మీటర్లు పాదయాత్ర చేయగా, కడప జిల్లాలో 7 నియోజక వర్గాలలో 16 రోజుల పాటు200 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం నెల్లూరు జిల్లాలో 10 నియోజక వర్గాలలో 31 రోజులపాటు 450 కిలోమీటర్లు పాదయాత్ర చేయగా, ఉమ్మడిప్రకాశం జిల్లాలో 8 నియోజక వర్గాలలో 17 రోజుల పాటు 220 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

విశాలాంధ్ర-తాళ్లూరు : మండల కేంద్రమైన తాళ్లూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనం నందు మంగళవారం మండల స్థాయి అధికా రులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొ న్నారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ విధానాలు అమలపరుస్తున్న తీరు తెన్నులను ఏ విధంగా పరిశీలించాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈఓఆర్‌డి కేజీఎస్ రాజు, ఎంఈఓ జి సుబ్బయ్య, ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ కే ఖాదర్ మస్తాన్ బి, ఏపీవో, ఏటీఎం భరద్వాజ్, హౌసింగ్ ఏఈ మనోహర్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

ఈ నెల 5వ షూటింగ్ బాల్

విశాలాంధ్ర-టంగుటూరు : మండలంలోని జమ్ములపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 5వ తేదీన ప్రకాశం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ విభాగంలో బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు సంఘం కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. 2004 ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు పోటీకి అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు జనన ధ్రువీకరణ పత్రంతో పాఠశాల వద్ద సంప్రదించాలని కోరారు.

వేప నూనె పిచికారితో బహుళ ప్రయోజనాలు

విశాలాంధ్ర-తాళ్లూరు : పైర్ల పెరుగుదలలో వేప నూనె పిచ్చికారితో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్ రావు అన్నారు. క్షేత్ర పర్యటనలో మంగళవారం ఆయన బొద్ది కూరపాడు గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు మాట్లాడుతూ పైరు మొలకెత్తిన 30 రోజుల లోపు రెండుసార్లు వేప నూనె పిచికారి చేయాలని దీనివల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. పైర్లపై వేప నూనెను పిచికారి చేసినట్లయితే దానిలోని చేదు వల్ల పురుగులు దరి చేరకుండా కాపాడినట్లు అవుతుందని ఆయన తెలిపారు. ఏఈఓ నాగరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు అజ్మీర్, రైతులు పాల్గొన్నారు.

1,152 పొగాకు బేళ్ల కొనుగోలు

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రానికి జరుగుమల్లి, టంగుటూరు, వావిలేటిపాడు, సాదువారి పాలెం గ్రామాలకు చెందిన రైతులు పొగాకు బేళ్లను తీసుకురాగా గరిష్టంగా ధర రూ.270 పలికింది. మొత్తం 1230 పొగాకు బేళ్లు రాగా వాటిలో 1152 బేళ్లను కొనుగోలు చేశారు. అయితే కనిష్టంగా రూ.160 ధర పలకగా, సరాసరి రూ.257.47 ధర లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర-పీసీపల్లి : గుదేవారిపాలెం పంచాయతీ పరిధిలోని చింతల పాలెం అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన నవరత్నాలలో భాగంగా పేదలందరికీ నిర్మిస్తున్న పక్కా ఇల్లు నిర్మాణాలను మండల ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ నెల 10వ తేదీ నిర్వహించబోయే నేషనల్ డి వార్మింగ్ డే నా చేపట్టవలసిన కార్యక్రమాల గురించి వారితో చర్చించారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియజేశారు. మండల ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు వెంట స్థానిక ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి హౌసింగ్ మండల విద్యాశాఖ అధికారి మండల వైద్యాధికారిణి పంచాయతీ సిబ్బంది వైద్య శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రకాశం జిల్లాకు ఆరో స్థానం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల గడప వద్దే ప్రభుత్వ సేవలను అందించినట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ చెప్పారు. 99.52 శాతం సేవలు అందించడం ద్వారా రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ఆరో స్థానంలో నిలిచిందన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు సచివాలయాల స్థాయిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం వివరాలను మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులుతో కలిసి ప్రకాశం భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. గత నెలలో జిల్లాలోని మొత్తం 719 సచివాలయాల పరిధిలో ప్రతి పోమ, బుధ, శుక్రవారాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 4,63,919 విజ్ఞపులు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. వీటిలో 4,61,521 అర్జీలను పరిష్కరించా మన్నారు. ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, ఇన్కమ్ సర్టిఫికెట్లు, ఆధార్‌తో మొబైల్ నెంబరు అనుసంధానం అప్డేట్, ఆర్.ఆర్.01ఎ సర్టి ఫికెట్లు, కంప్యూటరైజ్డ్ అడంగళ్, రేషన్ కార్డులో కొత్తగా సభ్యుని చేర్పు, జనన-మరణ సర్టిఫికెట్ల లేట్ రిజిస్ట్రేషన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, కొత్త రేషన్ కార్డు, సి.సి.ఆర్.సి. కార్డులకు సంబంధించిన సర్వీసుల కోసం అర్జీలు వచ్చాయన్నారు. ఒంగోలు డివిజన్ లో 1,84,204, మార్కాపురం డివిజన్లో లో 1,65,000, కనిగిరి డివిజన్లో 1,14,715 సర్వీసు విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు వారం రోజుల ముందుగానే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల గురించి ఆరాతీసి ఇంకా ఏమైనా సేవలు అవసరముంటే గుర్తించినట్లు చెప్పారు. వారం రోజులలోగా వీటిని పరిష్కరించి ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులు నిర్వహించి లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లను, సర్వీసును అందించినట్లు తెలిపారు. 7,70,325 ఇళ్ల నుంచి విజ్ఞప్తులు రాగా వాటిలో 6,71,098 ఇళ్ల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. కొందరు ఇళ్లకు తాళాలు వేసి పొరుగు ఊర్లకు వెళ్లడం వలస పూర్తి స్థాయిలో అర్జీలు పరిష్కారం కాలేదని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరించి వారికి అవసరమైన ప్రభుత్వ సేవలను అందిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారుల ఆధారమోదు ప్రక్రియ గతంలో 25 శాతం మాత్రమే ఉండగా ఈ నెల రోజులలో చేపట్టిన కార్యక్రమాల వలన ఇది 50 శాతానికి పెరిగిందన్నారు. మరో 45,443 దరఖాస్తులు వచ్చాయని, వీటివి. కూడా ఆగస్ట్ 15 లోగా పరిశీలించి అర్హత మేరకు ప్రయోజనం కల్పిస్తామని ఆయన చెప్పారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ప్రయోజనం అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన వెల్లడించారు.

తాగు నీటికే సాగర్ జలాలు :-
జిల్లాలో తాగు నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. కనీసం అక్టోబరు వరకు సరఫరా చేసేలా ముఖ్యంగా యర్రగొండ పాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాలలోని సి.పి. డబ్ల్యు. పథకాలకు సాగర్ నీటిని మళ్లించినట్లు తెలిపారు. సాగర్ నుంచి వచ్చిన ఈ నీళ్లను తాగు నీటి అవసరాలకే వినియోగించబోతున్నందున వర్షాధార పంటలను సాగు చేసేలా ఆర్.బి.కె.ల స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులను అభినందించిన నారా లోకేష్

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని కెల్లంపల్లి క్యాంపు సైట్ వద్ద మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలతో సమావేశమైన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని అధిక మెజారిటీతో గెలిపించి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. దర్శి నియోజకవర్గంలో యువగళం పాదయాత్రను విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందించిన లోకేష్. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం,దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మాజీ ఎంపిపి మందలపు వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, నాగులపాటి శివ కోటేశ్వరరావు, పిడతల నేమిలయ్య, కూరపాటి శ్రీను, బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, కాట్రాజు నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు.

గర్భవతులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : నెలలు నిన్న గర్భవతులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యాధికారులు సిహెచ్ ప్రవీణ్ కుమార్, బి మధుశంకర్‌లు తెలిపారు. మండలంలో నీ మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్ఎం, ఆశాలకు ఆరోగ్య సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గర్భవతులకు అందాల్సిన వైద్య సేవలు అందించాలన్నారు. గర్భవతులు హిమో గ్లోబిన్ టెస్ట్ చేయించుకోవాలన్నారు. పుట్టిన నవజాత శిశువులకు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటరావు, హెల్త్ ఎడ్యుకేటర్ అప్పల రాజు, సూపర్ వైజాగ్ నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్కేయం యం సుభాని, ఏఎన్ఎం, ఆషాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కండ్ల కలకకు హోమియోతోనే నివారణ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని ఎంద్రపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నందు హోమియో వైద్యులు డాక్టర్ యాకోబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు హోమి యో మందుల పంపిణీ, ప్రస్తుత సీజన్లో కండ్ల కలక వల్ల కళ్ళు ఎర్రబారిపోయి నీరు రావడం, కనురెప్పలు వాపు రావడం రాత్రిపూట పూర్తిగా కూసులతో మూసుకొని పోతుంటాయి నొప్పి, మంటలు ఉంటాయి ఇది అంటువ్యాధి ఇంట్లో ఒకరికి వస్తే వ్యాధి నిరోధక శక్తి ఉన్నచో ఇతరులకు వ్యాప్తిస్తుంది కంటి గుడ్డులోని తెల్లని పొర కంటి రెప్పల వెనుక ఉండే పొరను కంజెక్టివ్ అంటారు. చిన్నపిల్లలకు వస్తే ప్రమాదం అని తెల్లని పొర నుండి నల్లని పొర కార్నియాకు ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందితే చూపు తగ్గును.

లక్షణాలు :- కళ్ళు ఎర్రబారును ,కండ్లు మంట ,నొప్పి, నీరు కారడం, వాపు కంటి రెప్పలు అతుక్కొని పోవడం కసులు రావడం జరుగును.

జాగ్రత్తలు :- కండ్లను చల్లని నీటితో కడగాలి కండ్ల కలక వచ్చినవారు ఇతరులకు దూరంగా ఉండాలి. కంటి అద్దాలు వాడాలి. సరైన మందులు ఆహార నియమాలు తీసుకుంటే ప్రమాదం తగ్గుతు పాఠశాలలోనే విద్యార్థిని విద్యార్థులకు హోమియో మందు పంపిణీ చేయడం అయినది ఈ కార్యక్రమం నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. దేశానాయక్, బి సోమ్లా నాయక్ పాల్గొనడం అయినది.

2024లో వైసీపీ నుంచే గిద్దలూరు నుంచి పోటీ చేస్తా

ఎమ్మెల్యే అన్నా

అన్నా జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చిన ప్రజానీకం

విశాలాంధ్ర-గిద్దలూరు : వైసీపీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 2024లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గం నుంచే వైసీపీ తరపున పోటీ చేస్తానని శాసనసభ్యులు అన్నా రాంబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో అన్నా 60వ సంవత్సర జన్మదిన వేడుకలు ఆయన కుటుంబ సభ్యులు, వైసిపి నాయకులు, అభిమానుల సమక్షంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ప్రతిపక్ష నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని వీరందరికీ బుద్ది చెప్పేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసి ప్రజల ఆశీస్సులతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది అటువంటి వారికి సరైన సమాధానం చెప్తానన్నారు. మరోసారి శాసనసభ్యునిగా మీ ఆశీస్సులతో ఎన్నికై గిద్దలూరు ప్రాంత ప్రజల ఋణం తీర్చుకుంటానన్నారు. జన్మదిన వేడుక సందర్భంగా వైసీపీ అభిమానులు కొమరోలు మండలం తాటిచెర్ల మోటు వద్ద నుంచి సుమారు 15 కిలోమీటర్లు ద్విచక్ర వాహనాలపై పట్టణం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గిద్దలూరు చేరుకున్న అన్నాకు వైసిపి నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ గజమాలలతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ పర్యవేక్షణలో, గిద్దలూరు పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని సబ్ ఇన్స్పెక్టరులు,సిబ్బంది తో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సృజన

విశాలాంధ్ర-పామూరు : పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలు కీలకమని అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలను మించిన ఔషధం లేదని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సృజన అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ, ఆరోగ్య శాఖల సహకారంతో జిల్లా ఎస్‌బిసిసిసెల్, ఎన్‌జిఒల సమన్వయంతో మండలంలోని బోట్లగూడురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సృజన హాజరై ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలు ప్రకృతి అందించిన వరమని దీనికి మరేది సాటిరాదని తల్లుల్లో ఉన్న అపోహలతో కొందరు మాతృమూర్తులు వారి బిడ్డలకు శ్రేష్టమైన తల్లిపాలను దూరం చేస్తున్నారనే విమర్శలున్నాయని తెలిపారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ తదితర అంతర్జాతీయ సంస్థలతో పాటు, జాతీయ సంస్థలు తల్లిపాల ప్రాధాన్యతను తెలియజెప్పేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాయని అన్నారు. తల్లిపాల విశిష్టత, బిడ్డకు ఎంతవయస్సు వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వాలి, రోజుకు ఎన్నిసార్లు ఇవ్వాలి, పాలు పుష్కలంగా రావాలంటే తల్లులు ఎలాంటి ఆహారం తినాలి, ముర్రుపాలు ఎప్పుడు పట్టాలి ఇలా చాలా అంశాలపై అందరికీ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్, డాక్టర్ రవళి ప్రియాంక, సిడిపిఓ సరోజిని,మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజ నేయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మజ, వైద్య సిబ్బంది పెరుగు శ్రీధర్, ఎ.మురళి, ఎస్‌బిసిసి సెల్ జిల్లా సభ్యులు పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ రమేష్ బాబు, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు ఎస్.కె నాయబ్ రసూల్ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం

విశాలాంధ్ర-సింగరాయకొండ : పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని నరసింహనగర్‌లో నివాసముంటున్న ఓ వృద్ధురాలు పూరీల్లు దగ్ధమైన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. విపరీతమైన గాలికి విద్యుత్ వైర్లు చెట్లకు తగులుకొని షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పూరీళ్లు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. ఈ వృద్ధురాలు అంధురాలు కావడంతో కుమారుడు ఆమెను కాపాడాడు. ఆమె కుమారుడు వీధుల వెంట ఉన్న చెత్తను అమ్ముకొని జీవనం సాగిస్తుంటాడు. ప్రభుత్వం వారు సహాయం చేయాలని కోరుతున్నారు.

టీడీపీవి బురద రాజకీయాలు

-వైసీపీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత

విశాలాంధ్ర-ఒంగోలు : తెలుగుదేశం పార్టీవి బురదరాజకీయాలని వైసీపీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవార పోతుల సునీత మీడియా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌లు ప్రజలను అబద్దాలతో ముంచెత్తుతున్నారన్నారు. లోకేష్‌ది జోకర్ యాత్ర అన్నారు. బిసిలు జడ్జిలుగా పనికి రారని కేంద్రానికి లేఖ రాసింది టిడిపి కాదా అని ప్రశ్నించారు. జయహో బిసి అంటూ యాంకర్‌తో గ్లామర్ రాజకీయాలు చేస్తుందన్నారు. బిసిలను మోసం చేసింది టిడిపినే అన్నారు. బాబోస్తే జాబొస్తుందని, నిరుద్యోగ భృతి ఇస్తామనిచెప్పిన బాబు ఏం చేశారో చెప్పాలన్నారు. బిసిలను టిడిపి కేవలం ఓట్‌బ్యాంక్‌గానే వాడుకుంటుందన్నారు. తమిళనాడు, కర్ణాటక,ఎపిల మేనిఫెస్టోలన్నీ కలగలిపి టిడిపి మేనిఫెస్టో తయారు చేసిందన్నారు.వీటిని ప్రజలు నమ్మరన్నారు.

స్త్రీకి ప్రసవం మరుజన్మ లాంటిది

సన్నెబోయిన శ్రీనివాసులు

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-సింగరాయకొండ : సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీని వాసులు పుట్టినరోజు సందర్భంగా తన కుమారుడు కార్తీక్ ఆధ్వర్యంలో సోమ రాజు పల్లి పంచాయతీలో అంగన్వాడి కేంద్రం పరిధిలో గర్భిణీ స్త్రీలు బాలింత లకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరాయకొండ క్లస్టర్ సి.డి.పి.ఓ మల్లేశ్వరి పాల్గొని గర్భిణీ స్త్రీలకు తగు జాగ్రత్తలు తెలియజేస్తూ, పోషక విలువలు ఉన్న ఆహారం తల్లి పిల్లలు, గర్భిణీ స్త్రీలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయసేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు అంగన్వాడి సూపర్వైజర్లు నాగలక్ష్మి రిజ్వాన, పాల్గొన్నారు.

శక్తి కేంద్రాల ఆధారంగా మండలంలోని అన్ని బూతు కమిటీని నిర్మాణం చేయాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండల కేంద్రమైన సీఎస్‌పురంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఇండ్ల వెంకట సత్యం సత్యం అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథులుగా కొండిశెట్టి వెంకట రమణయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మాదినేని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ శక్తి కేంద్రాల ఆధారంగా మండలంలోని అన్ని బూతు కమిటీని నిర్మాణం చేయాలని, పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పూర్తి మండల కమిటీ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పామూరు మండల అధ్యక్షులు జజం చిన సుబ్బయ్య, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు దర్శి కిష్టయ్య, మండల బిజెపి నాయకులు మన్నేపల్లి మాల్యాద్రి, రెబ్బ నారాయణ, మేకల తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆశలు ఆశావాహులు

టీజేఆర్ పై ఎన్నికల పవనాలు

స్థానికుడు కాదంటూ కొత్త పల్లవి

అవినీతిపై స్వరం పెంచిన అసమ్మతి నేతలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : సంతనూతలపాడు నియోజకవర్గంలో వైసీపీలో వర్గపోరు ఆది నుంచి ఉంది. అయితే ప్రస్తుతం ఆయనపై అసమ్మతి గళం వినిపించడం వెనక మర్మం ఏమై ఉంటుందా..? అని స్థానికంగా విస్తృత చర్చకు దారి తీస్తోంది. ఇంత క్రితం వరకు ఆయన అవినీతిపై అస్త్రాలు సందించే నేతలు ఇప్పుడు అదనంగా వలసనేతగా చిత్రీకరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో 'స్థానికుడు'కి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ద్వితీయ స్థాయి నేతలు అధిష్టానాన్ని కోరుతుండడంతో గమనార్హం. దీంతో అసమ్మతి జ్వాలలకు ఆజ్యం పోస్తున్న ఆశావాహులు ఎవరనేది తేలాల్సి ఉంది.

నాడు ఆడించే ఆట, పాడించే పాట :- రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అనుకూల పవనాలు బలంగా వీచిన నేపథ్యంలో 2019లో పార్టీ అధిష్టానం సూచన మేరకు టీజేఆర్ సుధాకర్ బాబు సంతనూలపాడులో పోటీ చేశారు. నాడు ఆయన పనితీరు సమర్థత వంటివేమి పట్టించుకోకుండా వైసీపీ కేడర్ కూడా సంపూర్ణ మద్దతు తెలిపి గెలిపించింది. ఒకరకంగా గాలివాటంగా గెలిచినట్లేనని నేటికీ కేడర్ చెబుతూ ఉంటోంది. ఈ క్రమంలో ఎమ్మెల్యేగా పదవి చేపట్టిన టీజేఆర్ సుధాకర్ బాబుకు తొలి ఏడాదిన్నర కాలం స్వర్ణయుగమనే చెప్పాలి. నాటికి స్థానికసంస్థల ఎన్నికలు జరగకపోవడంతో స్థానిక నాయకత్వం కిమ్మనకుండానే ఉంది. చీమకుర్తి మండలంలో బూచేపల్లి కుటుంబానికి విధేయుడిగా ఉంటూ మిగిలిన మండలాల్లో తన హవా చూపారు. వచ్చిన తొలినాళ్లలోనే ఒంగోలు సీఐ పోస్టుకు లంచం డిమాండ్ చేశారని టీజేఆర్ పై అభియోగాలు వచ్చాయి. ఆ తర్వాత నామినేటేడ్ పదవులు, ఒప్పంద ఉద్యోగాలు, సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఖరారు, పార్టీ పదవుల కేటాయింపు ఇలా వివిధ అంశాల్లో తన ప్రాబల్యాన్ని చూపుకున్నారు.

ఆశవాహులు వీరే :- సంతనూతలపాడు నియోజకవర్గ నుంచి వైసీపీ టికెట్ ఆశించే వాళ్ళలో పలువురు స్థానిక నేతలు ఉన్నారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్న కొమ్మూరి కనకారావు టికెట్ ఆశిస్తున్నారు. ఇక విశ్రాంతి చీఫ్ ఇంజనీర్ సోము వీర్రాజు, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు చిట్టితోటి జీవన్ వంటి వారు కూడా నియోజకవర్గంలో ఆశలు పెంచుకున్నారు అప్పుడప్పుడు ఫ్లెక్సీలు వేస్తూ ఓ మోస్తారు చర్చకు లేవనెత్తారు. ప్రకాశం జిల్లా మాజీ కలెక్టర్ జి వి ఆర్ కె విజయకుమార్, పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య వంటి వారికి కూడా అవకాశం వస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే టీజేఆర్ పై అసమతి సెగ మరింత పెరగటం గమనార్హం.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు

విశాలాంధ్ర-తర్లుపాడు : తర్లుపాడు మండల కేంద్రం అయిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డియంహెచ్ఓ డాక్టర్ కాటమాల రాహుల్ విచ్చేసి తల్లి పాల ఉపయోగాల గురించి తెలిపారు పుట్టిన బిడ్డకి ముర్రు పాలు మొదటి టీకాలా పనిచేస్తుందని తల్లిపాలు బిడ్డకి శ్రేయస్కరం అని తల్లి పాలు అమృతం అని తెలిపారు. పుట్టగానే బిడ్డ తల్లి పాలు తాగుతుంటారు. ఆ సమయంలో పెదవులు, దవడలు ఉపయోగించి రొమ్ము పాలు లాగడం ద్వారా కండరాలకు వ్యాయామం అందుతుంది. ఈ కారణంగా పిల్లల్లో చెవి ఇన్ఫెక్షన్లు రావు అని తెలిపారు,తల్లి పాలల్లో ఉబ్బసం వ్యాధికి వ్యతిరేకంగా పోరాడే గుణాలు ఉంటాయని తెలిపారు అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింధూజ, సిహెచ్ఓ తులసి ప్రసాద్, అంగన్వాడీ సూపర్ వైజర్ కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్స్, సిబ్బంది పాల్గొన్నారు.